క్లుప్తంగా

గణతంత్ర వేడుకలకు సిద్ధం



అచ్చంపేట: గణతంత్ర వేడుకలను నిర్వహించేందుకు స్థానిక తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాలను ముస్తాబు చేశారు. కార్యాలయాలకు రంగులు వేయించి, జాతీయ పతాక తోరణాలతో అలంకరించారు. శనివారం తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ ఈ వేడుకలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు, ఎన్జీవోస్ హాజరు కావాలని కోరారు.

జిల్లా స్థాయిలో మెరిసిన ప్రగతి విద్యార్థులు



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలో జరిగిన జిల్లా స్థాయి విద్యా, సాంస్కృతిక పోటీల్లో ప్రగతి సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు చేతుల మీదుగా అవార్డు స్వీకరించినట్లు పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సూర్యదేవర శ్రీనివాసరావు శనివారం తెలిపారు. జె.శృతి చిత్రలేఖనంలో ప్రథమస్థానం, ఎస్.బబిత, ఆర్.లాస్య తృతీయ స్థానంలో నిలిచారని చెప్పారు. విద్యార్థులను పాఠశాల బోధనా సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

నేడు సత్తెనపల్లిలో చెస్ టోర్నమెంట్

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): గణతంత్రదినోత్సవం సందర్భంగా పట్టణంలోని చరితారెడ్డి డిఫెన్స్ అకాడమీ(ఆర్సీఎం ఎలిమెంటరీ స్కూల్) ప్రాంగణంలో ది సత్తెనపల్లి టోర్నమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పి.యిర్మియా, ఎస్.అచ్చిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పాల్గొనే విద్యార్థులు ఎవరి చెస్ బోర్డు వారే తెచ్చుకోవాలని తెలిపారు.


నూతన ఆధార్ కార్డులు అందజేత

నకరికల్లు: మండల కేంద్రంలోని సచివాలయంలో శనివారం ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఈటీపీఆర్డీ కె.వి.శివప్రసాద్ కార్డులు పంపిణీ చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో కండ్లకుంట ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం, 29, 30 తేదీల్లో కుంకలగుంట అంగన్‌వాడీ కేంద్రంలో క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లి పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు గణతంత్ర దినోత్సవం జరుగుతుందని, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి హాజరవుతారని పార్టీ కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల బాధ్యులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

బాల్యవివాహాల నివారణపై అవగాహన



పెదకూరపాడు: బాల్య వివాహాల నివారణపై మండలంలోని 75 త్యాళ్లూరు శాంతి కాలనీలో శనివారం మై చాయిస్ పౌండేషన్ సౌజన్యంతో.. సురక్షిత గ్రామ జ్యోతి పేరుతో లాంప్ సంస్థ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. సంస్థ కో–ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా లేని గ్రామాలను సురక్షిత గ్రామాలుగా సూచిస్తామన్నారు. సర్పంచ్ నరసయ్య, జైశ్రీ, సామాజికవేత్త గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, ట్రైనర్ షేక్ బాజి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైండింగ్ చోరీపై ఫిర్యాదు



నాగవరం(క్రోసూరు) : నాగవరం జెడ్పీ ఉన్నత పాఠశాల వెనుక ఉన్న 15 కేవీఏ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వైండింగ్ వైరు చోరీకి గురయ్యింది. విద్యుత్ ఏఈ బసవరాజు ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 19న చోరీపై జేఎల్ఎం సుధాకర్ సమాచార ఇవ్వడం పరిశీలించినట్లు ఏఈ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి అందులోని వైండింగ్ దొంగించారని, 60 లీటర్ల ఆయిల్ పారబోసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ శాఖకు రూ.50 వేలు నష్టం వాటినట్లు తెలిపారు.

పింఛన్ పీకేస్తారేమో!

- నకిలీల పేరుతో ఏరివేతకు కుట్ర
- భయం గుప్పిట్లో దివ్యాంగ, అనారోగ్య పింఛన్‌దారులు
- వెరిఫికేషన్‌తో పింఛన్ల తొలగింపునకు ప్రభుత్వం కసరత్తు
- పెంచడం ఎందుకు, తొలగించడం ఎందుకంటున్న దివ్యాంగులు
- నియోజకవర్గంలో 5,301 మంది పింఛన్‌దారులు

వివిధ రుగ్మతలతో బాధపడేవారిలో, దివ్యాంగుల్లో.. పింఛన్ పెరిగిందన్న సంతోషం ఆరు నెల్లోనే ఆవిరైంది. కూటమి ప్రభుత్వం అక్రమ పింఛన్ల పేరుతో అసలుకే ఎసరు పెడుతున్న వైనాన్ని పింఛన్‌దారులు జీర్ణించుకోలేకపోతున్నారు. పింఛన్ల తొలగింపు కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు లబ్ధిదారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. అక్రమంగా పింఛన్లు పొందారంటూ ప్రభుత్వ ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6వ తేదీ నుంచి పింఛన్ల వెరిఫికేషన్ చేపడుతున్నారు. దీంతో పింఛన్‌దారులు, వారి కుటుంబ సభ్యులు పింఛను ఉంచుతారో లేదోనని బెంబేలెత్తి పోతున్నారు.

సత్తెనపల్లి: పింఛన్ల వెరిఫికేషన్‌లో భాగంగా మొదటి విడతలో వివిధ రుగ్మతలతో మంచానికే పరిమితమై రూ.15 వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు వైద్య నిపుణులు వస్తున్నారు. సదరు పింఛను సక్రమమేనా అనే దిశగా విచారణ చేస్తున్నారు. దీంతో వచ్చిన అధికారులు పూర్తిస్థాయి పర్యవేక్షణ చేస్తారా! లేక ఏదైనా ఇబ్బందులకు గురి చేసి పింఛన్లు నిలిపివేస్తారా అనే విషయంలో పింఛన్‌దారులతోపాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో దఫాలో వచ్చే నెలలో దివ్యాంగులుగా నిర్ధారణ ధ్రువపత్రాలతో రూ.6వేలు పొందుతున్న పింఛన్‌దారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. సచివాలయ సెక్రెటరీలు ఇచ్చే నోటీసు ప్రకారం ఆయా తేదీల్లో సంబంధిత ఆసుపత్రిలో పరీక్షలు చేయిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో దివ్యాంగ పింఛనుదారుల్లో కూడా భయాందోళనలు నెలకొన్నాయి.

సత్తెనపల్లి నియోజకవర్గంలో...

సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో ప్రస్తుతం వివిధ రుగ్మతలతో మంచానికే పరిమితమైన పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి వైద్య నిపుణులు పరీక్షలు చేస్తున్నారు. దివ్యాంగులకు వచ్చే నెలలో ఆయా ఆసుపత్రిలో వికలాంగత్వ నిర్ధారణ పరీక్షలు తిరిగి చేయనున్నారు. మంచానికి పరిమితమై రూ.15 వేలు పింఛన్ తీసుకుంటున్న పింఛన్‌దారులు నియోజకవర్గంలో 164 మంది ఉండగా.. రూ.6 వేలు పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగ పింఛన్‌దారులు 5,137 మంది ఉన్నారు.



సత్తెనపల్లి రూరల్‌లో మంచానికే పరిమితమైన వారి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్న అధికారులు

కొన్ని పేదల ఇళ్లు అనారోగ్య, దివ్యాంగ పింఛన్లతోనే నడుస్తున్నాయి. జీవనోపాధిగా ఆయా కుటుంబాల పోషణ జరుగుతోంది. తమ పింఛన్లు తొలగిస్తే ఏం చేయాలంటూ లబ్ధిదారులు మదనపడుతున్నారు. కూటమి నాయకులు తమ పింఛన్లను తొలగించే కుట్రలు ఏమైనా పన్నుతారేమోనన్న భయం కూడా దివ్యాంగుల్లో ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ఎందుకంటే ఇప్పటికే తమ అనుకూలంగా లేని కాంట్రాక్ట్ ఉద్యోగులను, సామాజిక పింఛన్లను కూటమి పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి తొలగింపజేశారు.

పింఛను లబ్ధిదారుల వివరాలు		
మండలం	రూ.15 వేలు పింఛన్	రూ.6 వేలు పింఛన్
సత్తెనపల్లి టౌన్	08	533
సత్తెనపల్లి రూరల్	47	1,282
ముప్పాళ్ల	25	678
రాజుపాలెం	30	1,090
నకరికల్లు	54	1,554
మొత్తం	164	5,137

పింఛన్లు తొలగించేందుకే సర్వే



కూటమి ప్రభుత్వం దురుద్దేశంతో పింఛన్ల వెరిఫికేషన్ కుట్రకు తెరతీసింది. రూ.15 వేలు పింఛన్‌దారులను కుదించేందుకు దుర్మార్గానికి తెరతీసింది. రెండో దఫా దివ్యాంగులకు వికలాంగత్వ నిర్ధారణ పరీక్షలు చేయించేందుకు పన్నాగం పన్నింది. పింఛను మొత్తాన్ని పెంచడం ఎందుకు, తిరిగి కుదించేందుకు ఇన్ని కుట్రలు పన్నడం ఎందుకు. నిర్ధారణకు వచ్చే వైద్యులపై కూడా ఒత్తిడి చేసే పరిస్థితులు నెలకొన్నాయి.

–మంగళగిరి రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు, దివ్యాంగుల హక్కులపోరాట సమితి, పల్నాడు

29న గంగాదేవీ తిరునాళ్ల హక్కుల వేలం పాటలు

క్రోసూరు: మండలంలోని ఓర్వకల్లులో ఈ ఫిబ్రవరి 12న జరగనున్న గంగాదేవీ పేరంటళ్లమ్మ తిరునాళ్లకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వేలం పాటలు ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఈఓ ఎం.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న జరగాల్సిన వేలం పాటలు వాయిదా వేశారు. స్థానిక వీరభద్ర మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాటదారులు రూ.10 వేలు డిపాజిట్ చేయాలని, చెప్పులు భద్రపరుచుకునే పాటకు రూ.1000 డిపాజిట్ చేయాలని తెలిపారు. ఐస్ క్రీం విక్రయానికి ఏడాదిపాటు హక్కుపొందుతారన్నారు.

పాఠశాల ఆవరణలో అక్రమ వాటర్ ప్లాంట్



రుద్రవరం(ముప్పాళ్ళ): రుద్రవరం ప్రాథమిక పాఠశాల ఆవరణను ఆక్రమించి వాటర్‌ప్లాంట్ నిర్మిస్తున్నారని, వెంటనే తొలగించాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఇందూరి నరసింహారెడ్డి శనివారం తెలిపారు. పాఠశాల నిర్మాణానికి దాతలు అందించిన స్థలంలో వాటర్ ప్లాంట్ నిర్మించడం దుర్మార్గమన్నారు. పంచాయతీ అనుమతులు లేకుండా కరెంట్ మీటరు బిగించడం వెనుక ఎవరి హస్తం ఉందో తెలపాలంటూ ఎంపీడీవో సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి పాఠశాల ఆస్తులను కాపాడాలని కోరారు.

బహుజనుల చైతన్యం కోసం పాటుపడదాం

జీఎస్టీ సహాయ కమిషనర్ హనంబాబు



సత్తెనపల్లిలో అంబేడ్కర్ పుస్తకాన్ని అందిస్తున్న హనంబాబు

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): బహుజనులను చైతన్యవంతులను చేయడంతో పాటు వారిని విద్య, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధి వైపు పయనించేలా తనవంతుగా పాటు పడుతానని జీఎస్టీ సహాయ కమీషనర్, హైదరాబాద్ కొరబండి హనంబాబు అన్నారు. పట్టణంలోని బహుజన నాయకులతో కలిసి శుక్రవారం మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పే బ్యాక్ సొసైటీ చెప్పినట్లుగా తన వంతుగా జ్ఞానం, ఆర్థిక వనరులు సమయాన్ని కేటాయిస్తున్నట్లుగా ఆయన చెప్పారు. అందుబాటులో ఉన్న వారిని కలుపుకొని నెలలో నాలుగు రోజులు గ్రామాల్లోకి వెళ్లి బహుజనుల చైతన్యం కోసం పాటుపడుతానన్నారు. అనంతరం అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించి, పలువురికి పంపిణీ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు కేబీఆర్‌జే ప్రసాద్, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్, కాంట్రాక్టర్ కారుమంచి గంగరాజు, రమేష్ పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోండి



చామర్రులో పంటకోత ప్రయోగం

అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జేడీఏ కార్యాలయ ఏఎస్‌ఒ టి.మధుసూదనరావు తెలిపారు. చామర్రులో శనివారం ఆయన వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో వరిపంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వైపరిత్యాలను తట్టుకునేందుకు ఈ పథకం ద్వారా రైతులు ఎకరాకు రూ.630లు ప్రీమియం చెల్లించి, బీమా పొందవచ్చన్నారు. ప్రతి గ్రామంలో రెండు నుంచి నాలుగు పంట కోత ప్రయోగాలు చేసి సగటు దిగుబడుల వివరాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపడం జరుగుతుందన్నారు. రావాల్సిన దిగుబడులకన్నా వచ్చిన దిగుబడులు తగ్గినప్పుడు ఈ పథకం వర్తిస్తుందన్నారు. అయితే రైతులు ముందుగా ప్రభుత్వానికి బీమా ప్రీమియం చెల్లించి అర్హత పొందాలన్నారు. అర్హత పొందిన రైతులకు మాత్రమే బీమా వర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఏఏ బిల్లారహీం, ఎన్.మా న్యాయక్, ఇన్సూరెన్స్ అధికారి పి.గోపి, రైతులు పాల్గొన్నారు.

పశువులకు వైద్య సేవలు



చాగంటివారిపాలెంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ పుల్లారెడ్డి

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెం, బొల్లవరం గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను శనివారం నిర్వహించారు. ఆయా శిబిరాల్లో మండల పశు వైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి పాల్గొని వైద్య సేవలందించారు. 40 పశువులకు సాధారణ చికిత్సలు, 43 పశువులకు గర్భకోశ పరీక్షలు, 77 గేదెలకు చూడి పరీక్షలు, 124 దూడలకు నట్టల నివారణ మందు, 218 గొర్రెలకు బొబ్బ టీకా, 1010 గొర్రెలకు నట్టల నివారణ మందు అందించినట్లు ఆయన తెలిపారు.

అచ్చంపేట: స్థానిక పశు వైద్యశాలలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ గంగసాని నరశింహారెడ్డి సర్పంచ్ షేక్ జానీతో కలసి ప్రారంభించారు. పశువైద్యాధికారిణి డాక్టర్ స్వాతీదేవి మాట్లాడుతూ 34 పశువులకు సాధారణ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేశామన్నారు. 337 పశువులకు, 107 దూడలకు, 2700 జీవాలకు నట్టల నివారణ మందు తాగించినట్లు తెలిపారు.

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని రంగా కాలనీలో పశు ఆరోగ్య శిబిరం శనివారం జరిగింది. శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పశుపోషకులకు అందించారు.

రాయితీ పట్టలు ఎప్పుడిస్తారో..!



ధరణికోట కల్లాంలో ఆరబోసిన మిరపకాయలు



దరణికోటలో వానకు తడవకుండా మిర్చి పై కప్పిన పట్ట (ఫైల్)

అమరావతి: మండల పరిధిలో మిర్చి పంట కోతలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో మిరప కాయలను కల్లాల్లో ఆరబోసుకునేందుకు, గాలివానల నుంచి రక్షించుకునేందుకు కప్పే టార్పాలిన్ పట్టల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రాయితీపై అందించే పట్టలపై అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన లేదు. ఆకాశం మేఘావృతమైతే.. రైతులు ఆందోళనతో మిర్చి కల్లాల వైపు పట్టలు తీసుకుని పరుగులు తీయాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉంది. గతేడాది కొన్ని పట్టలు దెబ్బతినడంతో కొత్త పట్టల అవసరముంది. తెగుళ్ల వల్ల పంట దెబ్బతినడంతో మార్కెట్‌లో మిర్చి ధరలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొత్త పట్టలు కొనడం రైతులకు కొంత ఆర్థిక భారమే. ఉద్యాన శాఖ రాయితీ పట్టలను ఇంత వరకు పంపిణీ చేయలేదు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అకాల వర్షాలు, గాలి దుమారాలు వస్తే రైతులు పడే బాధ వర్ణనాతీతం. ఈ ఏడాది మండలంలో సుమారు 2,500 ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఎకరా మిర్చి ఆరబెట్టుకునేందుకు 60కి 40 సైజు పట్టలు రెండు అవసరమవుతాయి. వీటి ధర మార్కెట్‌లో రూ.7వేల నుంచి రూ. 8 వేల వరకు ఉంది. గతంలో వీటిని 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం పంపిణీ చేసింది. దీనిపై ఉద్యానశాఖాధికారి శ్రీనిత్య వివరణ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి టార్పాలిన్ పట్టల రాయితీపై ఎలాంటి సమాచారం ప్రస్తుతానికి లేదని చెప్పారు.

మన గ్రోమోర్‌లో ఆకస్మిక తనిఖీ

నకరికల్లు: మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు స్థానిక గ్రోమోర్ కేంద్రంలో శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎరువులు, పురుగు మందుల నిల్వలు పరిశీలించారు. బిల్ బుక్స్, స్టాకు రిజిష్టర్ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల నిమిత్తం రెండు రకాల ఎరువుల నమూనాలు ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. డీలర్లు ఎరువులను ఎమ్మార్పీకి మించి విక్రయించకూడదని స్పష్టం చేశారు. మన గ్రోమోర్ ఆర్ఎస్ఎం హరితేజ, సిబ్బంది ఉన్నారు.

మాజీ కౌన్సిలర్ సుభాని మృతి



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లి మున్సిపాలిటీ మొదటి కౌన్సిల్ సభ్యుడు, 4వ వార్డు మాజీ కౌన్సిలర్ సయ్యద్ మహబూబ్ సుభాని అనారోగ్య కారణంతో శనివారం మృతి చెందారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. సుభాని మృతదేహాన్ని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సయ్యద్ పెదకరిముల్లా సందర్శించి, నివాళులర్పించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : సీఐ

గురజాల రూరల్ : ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ ఆవుల భాస్కర్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే సమాచారం రావడంతో సీఐ డ్రోన్ సహకారంతో కాలనీని జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటివి చేయరాదన్నారు. ఆయనవెంట ఎస్ఐ వై.వినోద్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

శావల్యాపురం: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు తెలిపారు. శనివారం మండలంలోని పిచికలపాలెం, శావల్యాపురం గ్రామాల్లో రైతుసేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి 350 క్వింటాల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ దళారుల నుంచి రైతుల మోసపోకుండా ఉండటానికి ప్రభుత్వ మద్దతూ 76 కేజీల బస్తా ధర రూ.1740 రూపాయలకు తేమ శాతం నాణ్యాత ప్రమాణాలు ఆధారంగా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుటి వరకు 1100 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. ఆయనతో పాటు ఏఈవో పురేటి అశోక, మిల్లర్ అనిల్, వీఏఏ వెంకాయమ్మ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు పవిత్రమైనది



ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దారు శ్రీనివాసయాదవ్



సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్



పెదకూరపాడులో ఓటర్ల అవగాహన ర్యాలీ

అచ్చంపేట: మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు పవిత్రమైనదని, దాన్ని ప్రతి ఒక్కరూ నిస్వార్థంగా వినియోగించుకోవాలని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఓటు హక్కు ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది

ముప్పాళ్ళ: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనదని, ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించినప్పుడే ప్రజాస్వామ్య విలువలు పెరుగుతాయని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవంలో తహసీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కుపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా శాఖల మండల స్థాయి అధికారులు, బీఏల్‌ఓలు, విద్యార్థులతో కలిసి కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ నిర్వహించి, సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీజే విలియమ్స్, డీటీ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఎస్సై వి.సోమేశ్వరరావు, ఏఓ ఎం.అరుణ, ఎంఈఓ–2 సీతారామిరెడ్డి, హెచ్ఎం కె.నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

క్రోసూరు: భవిష్యత్తును మార్చగలిగే శక్తి ఒక ఓటుకు మాత్రమే ఉందని ఇన్‌చార్జి తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు అన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వీఆర్ఏలు, వీఆర్వోలు, బీఎల్‌వోలతో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను సత్కరించారు. మండల స్థాయిలో బయ్యవరం 148 బూత్ బీఎల్‌వో నాగ సౌర్యలమ్మ, 104వ బూత్ బీఎల్‌వో సీహెచ్ పేరయ్య ప్రశంస పత్రం అందుకున్నారు.

- శ్యామ్ మిత్ర మండలి ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మండలి గౌరవాధ్యక్షుడు శిఖా శాంసన్, హెచ్ఎం ఆంజనేయులు, హెల్త్ ఆఫీసర్ గోగినేని సాంబశివరావు, ఉపాధ్యాయులు దుగ్గి బాబురావు పాల్గొన్నారు.

పెదకూరపాడు: జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు మీసాల దానియేలు సినియర్, దివ్యాంగ ఓటర్లను నూతనంగా ఓటు హక్కు పొందిన వారితో సత్కరింపజేశారు.

రాజుపాలెం: స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి శనివారం జాతీయ ఓటరు దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు దుర్గేష్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, ఎంఈవో–2 నరసింహారావు, రాజుపాలెం పాఠశాల హెచ్ఎం అరుణ పాల్గొన్నారు.

ముంపు సమస్య పరిష్కారానికి వినతి



మంత్రి నారాయణకు అర్జీ అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు.. నాలుగు కిలోమీటర్ల మేరకు వరద నీటి కాలువ నిర్మాణానికి రూ.22కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కోరారు. విజవాడలో మంత్రి నారాయణను శనివారం కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వివరించారు. రఘురాంనగర్, నరసరావుపేట రోడ్డు ప్రాంతాల్లో రెండు పార్కులను అభివృద్ధి చేసేందుకు రూ.కోటిన్నర, సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధాన రహదారిని నాలుగు లేన్లుగా విస్తరణకు రూ.6.5 కోట్లు కేటాయించాలని కోరారు. మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

బావిలో వృద్ధురాలి మృతదేహం

గురజాల: బావిలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన మేదర సుందరమ్మ (80) గత మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. గత కొద్ది రోజులుగా గురజాలలో శ్రీరాంపురం రోడ్డులో సంచరిస్తుందని స్థానికులు తెలిపారు. శనివారం ఉదయం దుర్వాసన వస్తుండటంతో స్థానికులు బావిలో చూడగా మృతదేహం దర్శనమిచ్చింది. మృతదేహాన్ని సుందరమ్మది గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సీఐ భాస్కర్, ఎస్ఐ వై.వినోద్‌కుమార్ పరిశీలించారు.

పూర్తయిన కుష్ఠు నిర్ధారణ సర్వే



పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం, గణపవరం గ్రామాల్లో కుష్ఠు నిర్ధారణ సర్వేను ఆరోగ్య సిబ్బంది శనివారం నిర్వహించారు. డాక్టర్ కృష్ణకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి అనుమానితులకు పరీక్షలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తయ్యిందని, 41,450 జనాభాకు గాను 11,500 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు డాక్టర్ తెలిపారు. 25 మందికి అనుమానిత లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. అనుమానితులు ఎండీటీ మందులు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు.